క్లుప్తంగా

ఘనంగా ఆలయాల వార్షికోత్సవం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని సాయిబాబా మందిరంలో వేంచేసి ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి, శ్రీనాగేంద్రస్వామి వార్ల 13వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి వారికి ఆకుపూజ, పంచామృతాలతో అభిషేకం, నాగేంద్రస్వామి వారికి 25 లీటర్ల ఆవుపాలతో అభిషేకాలు జరిగాయి. రాళ్లబండి వెంకట మురళీకృష్ణ, ఆదిలక్ష్మీ కామేశ్వరీ దంపతులచే స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి.

హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడిగా కోలవెన్ను కొండా



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యుడిగా 33వ డివిజన్‌కు చెందిన కోలవెన్ను కొండా నియమితులయ్యారు. ఈ మేరకు సత్యనారాయపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శర్వాణిమూర్తి మాట్లాడుతూ సత్యనారాయణపురంలోని కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ధర్మకర్తల మండలి సభ్యునిగా సేవలు అందిస్తున్న కోలవెన్ను కొండాను హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యునిగా నియమించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లంకా బాబు, చాంద్, సనత్, కమ్మిలి రత్నకుమార్, ఫణి, నాదేండ్ల శంకర్ పాల్గొన్నారు.

రేపు మాదిగల జన జాగృతి సభ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 7వ తేదీ శుక్రవారం గాంధీనగర్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించే మాదిగల జన జాగృతి సభను జయప్రదం చేయాలని మాదిగల రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక సభ్యుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ అధ్యక్షతన బుధవారం మాదిగల జన జాగృతి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ.. మాదిగలు సంక్షేమానికి, అభివృద్ధికి రాజకీయ ప్రాధాన్యతకు నోచుకోలేక అన్ని రాజకీయ పార్టీల నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. వర్గీకరణతో పాటు మాదిగల సమగ్ర అభివృద్ధి విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను కల్పించే విధంగా మాదిగ జాతి ముందుకు వెళ్లే విధంగా మాదిగలను చైతన్యం చేస్తున్నామన్నారు. నూతన ప్రజాస్వామిక ఉద్యమాన్ని నిర్మించే క్రమంలో ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గాంధీనగర్ జింఖానా గ్రౌండ్‌లో జరిగే మాదిగల జన జాగృతి సభ కు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్లు వైఎస్ రాజు మాదిగ, పానుగంటి సాలెం రాజు మాదిగ, బొడ్డు కిషోర్ మాదిగ కేవీపీసీఎస్ వ్యవస్థాపకుడు పరిశపోగు రాజేష్ మాదిగ, జిల్లా నాయకులు మార్కపూడి విజయ్ మాదిగ పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని వన్‌టౌన్ సీఐ ఆర్.సురేష్‌రెడ్డి హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమ రవాణా, నిషేధిత పొగాకు, గంజాయి వంటి విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు సీఐ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, లా అండ్ ఆర్డర్ అధికారులు సిబ్బందితో కలిసి స్థానిక స్టేషన్ పరిధిలో తనిఖీలు చేశారు. అందులో భాగంగా అర్జున్ వీధి నుంచి మల్లిఖార్జునపేట వరకు తనిఖీలు కొనసాగించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలపై, నేరస్తుల కదలికలపై నిఘా ఉంటుందన్నారు. మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, సరఫరా చేసినా సహించేది లేదని స్పష్టం చేశారు. అదే విధంగా బైక్ ర్యాష్ డ్రైవింగ్, ఈవ్ టీజింగ్‌కు పాల్పడే ఆకతాయిలపై నిఘా పెట్టామన్నారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలకు సత్వర మేలు

- సుపరిపాలనకు నిదర్శనం 'జగనన్న సురక్ష'
- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



27వ డివిజన్‌లో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్ మల్లీశ్వరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు సత్వర మేలు జరుగుతుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 27వ డివిజన్ దుర్గాపురంలో బుధవారం నిర్వహించిన సురక్ష శిబిరంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రతి పేదవాడికి సంక్షేమం, ప్రభుత్వ పాలనను చేరువచేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేక సంక్షేమ పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపుల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించి.. 11 రకాల ధ్రువీకరణ పత్రాలు పూర్తి ఉచితంగా అందజేస్తున్నామన్నారు. డివిజన్‌లోని 4 సచివాలయాల పరిధిలో 725 మంది వివిధ రకాల పత్రాలు కోసం వినతులు సమర్పించినట్లు మల్లాది విష్ణు తెలిపారు. వీరిలో 239 మంది కుల సర్టిఫికెట్ల కోసం, 222 మంది ఆదాయ, 10 మంది బియ్యం కార్డుల కోసం అర్జీలు ఇచ్చారన్నారు. వీరందరికీ ఎటువంటి రుసుం లేకుండా సర్టిఫికెట్లను అందజేశామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు, సేవలతో సంతృప్తి చెందిన లబ్ధిదారులు.. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తూ 90526 90526 నంబర్‌కు ఎస్‌ఎంఎస్ చేయాలని కోరారు. అనంతరం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూసీడీ పీవో శకుంతల, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, అన్ని శాఖల అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

28వ డివిజన్‌లో..

28వ డివిజన్‌లో నిర్వహించిన 'జగనన్న సురక్ష' శిబిరంలో డివిజన్ ఇన్‌చార్జి కనపర్తి కొండతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని 53 క్లస్టర్లలో 3,642 నివాసలుండగా.. 957 మంది వివిధ రకాల పత్రాలు కోసం వినతులు సమర్పించారన్నారు. వీరిలో 241 మంది కుల సర్టిఫికెట్లకు, 313 మంది ఆదాయం, 17 మంది బియ్యం కార్డుల కోసం అర్జీలు ఇచ్చినట్లు చెప్పారు. ఎలాంటి సర్వీస్ చార్జీలు తీసుకోకుండా సర్టిఫికెట్లు అందజేశామన్నారు. అలాగే నగర పౌరులు ఎవరైనా ఇతర ప్రాంతాల్లో మృతి చెంది స్థానికంగా అంత్యక్రియలు జరిగినట్లయితే.. చుట్టుప్రక్కల ప్రజల పంచనామాతో వారికి ఇక్కడే డెత్ సర్టిఫికెట్ ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని చెప్పారు. అనంతరం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నార్త్ ఎమ్మార్వో ఎం.మాధురి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిలిచి మరీ సర్టిఫికెట్‌లు ఇచ్చారు..



గతంలో రెండు సార్లు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసినప్పటికీ రాలేదు. ఈ వయస్సులో ఆఫీసుల చుట్టూ తిరిగే ఓపిక లేక వదలివేశాం. వలంటీర్, గృహసారథులు ఇంటికి వచ్చి జగనన్న సురక్ష పథకం గురించి తెలిపారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్నా. సర్టిఫికెట్‌లు వస్తాయని అనుకోలేదు. కానీ జగనన్న సురక్ష శిబిరానికి పిలిచి ఒక్క రూపాయి కూడా ఖర్చులేకుండా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ మల్లీశ్వరికి కృతజ్ఞతలు.

కొండపల్లి వెంకట లక్ష్మి, స్థానికురాలు

అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ జగనన్న పాలన

- గడప గడపకు మన ప్రభుత్వంలో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ జగనన్న పాలన అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 30వ డివిజన్ 246వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జానారెడ్డి నగరపాలకసంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశంలోనే శిఖరాగ్రాన నిలిచిందన్నారు. నవరత్నాలతో సీఎం వైఎస్ జగన్ నవశకానికి నాంది పలికారని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ పథకాలను వివరించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై ఆరా తీసిన ఆయన వాటన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు.

సచివాలయ పరిధిలో రూ.4.20 కోట్ల సంక్షేమం

నవరత్నాల కార్యక్రమాల ద్వారా సచివాలయ పరిధిలో 4 కోట్ల 20 లక్షల 52 వేల 154 రూపాయల సంక్షేమాన్ని నాలుగేళ్లలో అందజేసినట్లు ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. అలాగే పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ 297 మందికి సచివాలయ పరిధిలో ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని చెప్పారు.

ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే...

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఢీకొనే సత్తా ఏ ఒక్క రాజకీయ పార్టీకి లేదని ఎమ్మెల్యే అన్నారు. సర్వేలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. ప్రతి సర్వేలోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ బలంగా కోరుకుంటున్నట్లు చెప్పారు. అది చూసి ఓర్వలేక చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ పనిగట్టుగుని విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నారా లోకేష్ స్థాయికి మించి మాట్లాడుతూ.. అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ రామకోటేశ్వరరావు, సీడీవో జగదీశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు, అన్ని శాఖల అధికారులు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

- ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ జయమోహన్



రైల్వే స్టేషన్‌లో శానిటరీ న్యాప్‌కిన్స్ మిషన్‌ను ప్రారంభిస్తున్న జయమోహన్ తదితరులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): మహిళల ఆరోగ్యంపై అవగాహన ఉండాలని విజయవాడ డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ జయ మోహన్ పేర్కొన్నారు. ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ రైల్వే స్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన శానిటరీ న్యాప్‌కిన్ డిస్పెన్సర్, న్యాప్‌కిన్ ఇన్సినరేటర్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జయమోహన్ మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్‌లో అత్యవసర పరిస్థితుల్లో మహిళా ప్రయాణికులు, మహిళా ఉద్యోగులకు అందుబాటులో ఉండేలా రూ.5కే శానిటరీ న్యాప్‌కిన్స్ అందించే మిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. రుతుస్రావ ఆరోగ్యంపై మాట్లాడేందుకు మహిళలు అవమానంగా భావించకుండా బహిరంగ వేదికలపై కూడ మాట్లాడేందుకు ముందుకు రావాల్సిందిగా పిలుపునిచ్చారు. మహిళలు సరైన రుతుస్రావ పద్ధతులను పాటించడం ద్వారా రోజువారి కార్యకలాపాల్లో చురుగ్గా ఉంటారన్నారు. స్టేషన్‌లో అందుబాటులో ఉన్న ఈ నిత్యవసర సౌకర్యాలపై మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పించాల్సిందిగా సిబ్బందికి సూచించారు. అనంతరం మహిళా ఉద్యోగులకు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైల్వే హాస్పిటల్ గైనకాలజిస్ట్, ఏసీఎంఎస్ డాక్టర్ శారద బహిష్టు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మహిళలకు చిట్కాలను వివరించారు. వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ డి.శ్రీదేవి, స్టేషన్ డైరెక్టర్ పీబీఎస్ ప్రసాద్, పీఆర్వో నుస్రత్ మండ్రూప్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అన్ని వర్గాలు సంతృప్తిగా ఉన్నాయి

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



నాగరాజుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, అన్ని పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వైఎస్సార్ సీపీలో చేరడమే దీనికి నిలువెత్తు నిదర్శనమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వాంబేకాలనీలోని జనంలో మనం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పొదిగింటి నాగరాజుతో పాటు మరో 100 మంది సభ్యులు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో తెలిపిన ప్రతి హామీని తూ.చ. తప్పకుండా అమలుచేసి చూపిన ఏకైక ముఖ్యమంత్రి ఈ దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని అన్నారు. కార్యకర్తలు కాలర్ ఎగరేసుకొని చెప్పుకునే విధంగా జగనన్న ప్రజా రంజక పాలనను అందిస్తున్నారని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని సూచించారు. జనంలో మనం అనే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి ఎంతోమంది నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషిచేస్తున్న నాగరాజు, వారి బృందం అంతా వైఎస్సార్ సీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ప్రభుత్వ పథకాలు అద్భుతం..

పొదిగింటి నాగరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుపేద ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు చాలా అద్భుతంగా ఉన్నాయన్నారు. పేద ప్రజల కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై తామంతా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామని చెప్పారు. ముందుగా వాంబేకాలనీలో నుంచి బైకులు, కార్లు, తీన్‌మార్‌తో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణును శాలువా, గజమాలతో సత్కరించారు. జనంలో మనం స్వచ్ఛంద సేవా సంస్థ ట్రెజరర్ నబీగారు వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు భోగాది అనిల్‌కుమార్, సభ్యులు మ్యాథ్యూస్, కిరణ్, అజీమ్‌తో సహా వంద మంది సభ్యులకు ఎమ్మెల్యే విష్ణు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. 60వ డివిజన్ నాయకులు బెవర నారాయణ, బత్తుల దుర్గారావు, ఇస్మాయేల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అధ్యయన బృందం రాక

విజయవాడరూరల్: డ్వాక్రా గ్రూపుల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి నిర్వహిస్తున్న పథకాలను అధ్యయనం చేసేందుకు ఈ నెల7వ తేదీన ఒరిస్సా నుంచి అధికారుల బృందం వస్తున్నట్లు వెలుగు ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు. విజయవాడ రూరల్ మండలంలో డ్వాక్రా మహిళలచే నిర్వహిస్తున్న యూనిట్స్‌ను ఒరిస్సా అధికారుల బృందం పరిశీలిస్తుందని పేర్కొన్నారు. ప్రసాదంపాడు గ్రామంలో ఇస్తర్లు తయారీ యూనిట్, పేపరు గ్లాసుల తయారీని పరిశీలిస్తారన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం 10 లక్షల రూపాయల వరకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. మండలంలో 20 యూనిట్లు చిన్న పరిశ్రమలు మహిళలచే నడుస్తున్నాయని పేర్కొన్నారు.

దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, గ్రంథాలయం కమిటీ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు దాతలు, స్వచ్ఛంద సంస్థల సేవలను సద్వినియోగం చేసుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పిలుపునిచ్చారు. స్థానిక ముత్యాలంపాడు గోకరాజు రంగరాజు కల్యాణ మండపంలో అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం ఆధ్వర్యాన దాత సాగి భగవాన్ రాజు సహకారంతో విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దాత సాగి భగవాన్ రాజుతో కలిసి 50 మంది విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో 500కి పైగా మార్కులు సాధించిన నగరపాలకసంస్థ పాఠశాలలు, సూర్యపబ్లిక్ స్కూల్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించటం అభినందనీయమన్నారు. దాత సాగి భగవాన్‌రాజు, అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కె సుబ్బరాజు, పీవీ సుబ్బరాజు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో భాగంగా సూర్యపబ్లిక్ స్కూల్‌తో పాటు నియోజకవర్గంలోని పలు ప్రభుతపాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో 500కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వరరాజు, డి.భాస్కరరాజు, కోశాధికారి డీజేపీఎస్ రాజు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తండ్రి మందలించాడని విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన భవానీపురం స్టేషన్‌లో పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊర్మిళానగర్‌కు చెందిన మెట్టిల సుబ్బారావు స్థానిక ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 2వ తేదీ ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం 5 గంటలకు తిరిగి వచ్చాడు. ఇంటికి ఆలస్యంగా వచ్చావు ఇప్పటి వరకు ఎక్కడికి వెళ్లావని తండ్రి సుబ్బారావు మందలించాడు. తండ్రికి సరైనా సమాధానం చెప్పకపోగా పుస్తకాలు ఎప్పుడు కొంటారని ఎదురు ప్రశ్నించాడు. ఆ తర్వాత బాలుడు తండ్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 8 గంటల సమయంలో వచ్చి చూడగా సుబ్బారావు కనిపించలేదు. అప్పుడప్పుడు గాంధీనగర్ చారిటబుల్ ట్రస్ట్ వద్దకు వెళ్తాడని తెలిసి అక్కడికి వెళ్లి ఆరా తీశారు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికారు. రైల్వే, బస్ స్టేషన్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీనిపై భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా బాలుడు అదృశ్యంపై కేసు నమోదు చేశారు.

సీఎం వైఎస్ జగన్ వెంటే ముస్లిం మైనార్టీలు



కరపత్రాలు ప్రదర్శిస్తున్న రఫీ, ముస్లింలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల సంక్షేమాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని, రాష్ట్రంలోని ముస్లింలు జగనన్న వెంటే నడుస్తామని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ అన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశాల మేరకూ సింగ్‌నగర్ 58వ డివిజన్‌లోని మస్జిద్ ఏ మమూర్, మస్జిద్ ఏ అక్సా ఆహిలే హదీస్ మస్జీదుల్లో ×హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ జగన్‌కే సాత్‌×' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా స్థానిక ముస్లిం పెద్దలతో, మస్జీద్ బాధ్యతులతో సమావేశం నిర్వహించారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు దేశంలో ఏ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ముస్లిం మైనార్టీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు జగనన్న తీసుకుంటున్న నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. వైఎస్ కుటుంబం అంటేనే ముస్లింల పక్షపాతి అని, ముస్లింలంతా జగనన్న వెంటే పయనిస్తామని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ ఎండీ అఫ్రోజ్, ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా, వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ అబ్దుల్ నజీర్, నాయకులు మహ్మద్ ఇస్మాయేల్, సయ్యద్ బాబు, షేక్ షేర్‌అలీ, అబ్దుల్ రజాక్, జమాతే అహలే హదీస్, సయ్యద్ అతికుర్ రెహమాన్, అమానుల్లా, చాన్‌భాషా, తనీర్, ఆలీం పాల్గొన్నారు.

● కమ్మేసిన కారుమబ్బులు



జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడింది. ఈ క్రమంలో రామవరప్పాడు రింగ్ శివారు ప్రాంతంలో బుధవారం సాయంత్రం కమ్మేసిన కారుమబ్బులను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

టీడీపీ పాలనలో శిలాఫలకాలకే అభివృద్ధి పరిమితం

భవానీపురం(విజయవాడపశ్చిమ): టీడీపీ పాలనలో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమైందని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ విమర్శించారు. రాజకీయ నిరుద్యోగి అయిన జలీల్‌ఖాన్ పనీపాట లేక కబేళా వద్దగల ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల భవన నిర్మాణ శిలాఫలకం వద్ద నిలబడి రాష్ట్ర ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును తూలనాడుతూ ఇష్టారాజ్యంగా మాట్లాడిన జలీల్‌ఖాన్ వ్యాఖ్యలను గౌస్ మొహిద్దీన్ తీవ్రంగా ఖండించారు. విద్యాధరపురంలోని షాదీఖానా ప్రాంగణంలో రూ.80 కోట్ల వ్యయంతో హజ్ హౌస్ నిర్మిస్తామని చంద్రబాబు చెప్పిన శిలాఫలకం వద్ద ఇటీవల నిలబడి జలీల్‌ఖాన్ హడావుడి చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు హజ్ హౌస్ నిర్మించలేకపోయాడని ఎద్దేవా చేయటమే దాని ఉద్దేశమా అని ప్రశ్నించారు. బుధవారం ఆయన 45వ డివిజన్ వైఎస్సార్ సీపీ బాధ్యులు మైలవరపు కృష్ణతో కలిసి కబేళా వద్దగల ఉర్దూ జూనియర్ కాలేజీని సందర్శించారు. నిర్మాణ పనులు జరుగుతున్న కాలేజీ భవనం ఫస్ట్ ఫ్లోర్‌ను పరిశీలించారు.

ఉర్దూ కళాశాలను తీసుకొచ్చిన ఘనత వెలంపల్లిదే

గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ నగరంలో ఉర్దూ పాఠశాల్లో చదివి ఉన్నత చదువులు కోసం ఎక్కడెక్కడికో వెళ్లాల్సి వస్తుందన్నారు. ముస్లిం మైనార్టీలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గం వించిపేటలో ఉర్దూ కళాశాలను ఏర్పాటు చేసిన ఘనత స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుదేనని అన్నారు. అయితే అక్కడ ఇరుకుగా ఉన్న దృష్ట్యా దానిని కబేళా వద్ద నూతనంగా నిర్మించిన భవనంలోకి తీసుకువచ్చారని తెలిపారు. వాస్తవాలు ఇలా ఉంటే టీడీపీ హయాంలో ఉర్దూ కాలేజీ కోసం భవన నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా వదిలేస్తే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉర్దూ కాలేజీ భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి నాడు–నేడు ద్వారా రూ.38 లక్షలు నిధులు కేటాయించి పూర్తి చేయిస్తున్నది వెలంపల్లి అన్నారు.

ముసాఫిర్‌ఖానాను ప్రారంభించింది సీఎం జగన్

పశ్చిమ నియోజకవర్గంలో షా జహూర్ ముసాఫిర్‌ఖానా నిర్మాణాన్ని పూర్తి చేయకుండా వదిలేస్తే, కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లించి దానిని పూర్తి చేయించి ప్రారంభించిన ఘనత సీఎం జగన్‌దేనని తెలిపారు. ప్రభుత్వం, వెలంపల్లిపై బురద చల్లటం మానుకోవాలని జలీల్‌ఖాన్‌కు హితవు చెప్పారు. నాయకులు ముత్తా వాసు, నంబూరు ప్రదీప్, బడేమియా, గంగవరపు మురళి, షేక్ రహమతుల్లా, నడికట్టు రమణారెడ్డి, మీరా పాల్గొన్నారు.